# కాంగ్రెస్-బీజేపీ ఒక్కటే

### ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడమే వాటి లక్ష్యం • ప్రజలను ఫూల్స్ చేయడంలో కాంగ్రెస్ ప్రొఫెషనల్

### అమృత్‌స్కీం స్కాంపై ఆధారాలు సమర్పించా • విమర్శలే కాదు చర్యలూ తీసుకుంటామని బీజేపీ ప్రభుత్వం నిరూపించుకోవాలి: కేటీఆర్

- అదానీ ఫ్రెండా.. ఫ్రాడా? అనేది రాహుల్, రేవంత్ చర్చించుకోవాలి
- ఫార్ములా-ఈ తో అంతర్జాతీయంగా హైదరాబాద్‌కు 'ఫేం' తెచ్చాం
- ఈవెంట్‌ను క్యాన్సిల్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం 'షేమ్' చేసింది
- ఇండియాటుడే ఇంటర్వ్యూలో కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): దేశంలో ప్రాంతీయ పార్టీలను నామరూపాలు లేకుండా చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. అమృత్ పథకం టెండర్లలో అవినీతికి సంబంధించిన ఆధారాలను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చానని చెప్పారు. కాంగ్రెస్‌పై విమర్శలు మాత్రమే కాదని, అవసరమైతే చర్యలు కూడా తీసుకుంటామని బీజేపీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీకి వెళ్లిన కేటీఆర్‌ను ప్రముఖ జాతీయ చానల్ ఇండియా టుడే ఇంటర్వ్యూ చేసింది. ఆ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు

**మీరు ఢిల్లీకి ఎందుకు వచ్చారు?**

ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'అమృత్' టెండర్లలో అవకతవకలు జరిగాయి. ఇదే అంశంపై ఫిర్యాదు చేయడానికి ఢిల్లీకి వచ్చాను. ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ మార్చి 13న ఎన్ఎస్ఈ, బీఎస్ఈకి రాసిన లేఖతో ఇది బయటికి వచ్చింది. తెలంగాణలో రూ.1,100 కోట్ల పనులను తాము దక్కించుకున్నామని, శోధ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నామని తెలిపింది. ఇందులో 20% పనులు మాత్రమే తాము చేస్తున్నామని, 80% పనులు శోధ కంపెనీ చేపడుతున్నదని లేఖలో వివరించింది. శోధ కంపెనీ సీఎం రేవంత్‌రెడ్డి బావమరిదికి చెందినది. సాంకేతికంగా , ఆర్థికంగా చూసినా ఆ కంపెనీకి పనులు చేపట్టే అర్హత లేదు. సీఎం బంధువనే ఏకైక కారణంతో బిడ్ దక్కింది. క్రోనీ క్యాపిటలిజం, అధికార దుర్వినియోగం గురించి రాహుల్ గాంధీ మాట్లాడుతుంటారు. కానీ, తెలంగాణలో కాంగ్రెస్ అదే చేస్తున్నది. ప్రధాని నరేంద్రమోదీ తరుచూ కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందని ఆరోపిస్తున్నారు. ఆర్ఆర్ ట్యాక్స్, ట్రిపుల్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని దేశమంతటా చెప్తున్నారు. ప్రధాని ఆరోపణలకు సంబంధించి ఆధారాలను సమర్పించడానికే ఢిల్లీకి వచ్చాను. 'ఆరోపణలు చేయడమే కాదు.. చర్యలు కూడా తీసుకుంటాం' అని నిరూపించుకోవాలి.

**రేవంత్‌రెడ్డి బావమరిది మీకు లీగల్ నోటీసులు ఇచ్చారుగా. మరి మీ ఆరోపణలపై నిలబడుతున్నారా?**

నేను తప్పుగా మాట్లాడానని నిరూపించమని చెప్పండి. శోధ కంపెనీ గత సంవత్సరం లాభం రూ.2.2 కోట్లు మాత్రమే. అలాంటి కంపెనీ రూ.1,100 కోట్ల పనులు ఎలా చేపడుతుందో ఎవరైనా చెప్పగలరా? శోధ కంపెనీ కన్నా దాదాపు రెండు వేల రెట్లు పెద్దదైన ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ కేవలం 20% పనులు మాత్రమే ఎందుకు చేపట్టిందో వివరించగలరా?

**మీరు కేంద్ర మంత్రి కట్టర్‌ను కలిశారు. గతంలోనూ లేఖలు రాసినట్టున్నారు?**

అమృత్ పథకం నిధులు కేంద్ర ప్రభుత్వానికి చెందినవి. పట్టణాభివృద్ధి శాఖకు చెందిన పనులు కాబట్టి మనోహర్‌లాల్ కట్టర్‌ను కలిశాను. గతంలోనూ మంత్రికి లేఖలు రాశాను. కానీ, ఆయన హర్యానా ఎన్నికల్లో బిజీగా ఉండటం వల్ల చూడలేదేమో. అందుకే

స్వయంగా వచ్చి వివరాలు ఇచ్చాను. ఇప్పుడైనా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను.

**కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు తెలంగాణ, కర్ణాటక నుంచి నిధులు తరలిస్తున్నదని ఆరోపిస్తున్నారు?**

ఇప్పుడు రాహుల్‌గాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి బంగారు గనిలా మారారు. గతంలో శివకుమార్ ఉండేవారు, ఇప్పుడు రేవంత్ వచ్చారు. మహారాష్ట్ర, జార్ఖండ్‌కు ఎక్కడినుంచి డబ్బులు వెళ్తున్నాయో అందరికీ తెలుసు. రేవంత్‌రెడ్డి ఎవరిని బెదిరిస్తున్నారు? ఎవరి దగ్గరి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు? వంటివి మాకు తెలుసు. కానీ దర్యాప్తు సంస్థలు ఎందుకో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయి.

**దేశంలో బీజేపీ, కాంగ్రెస్ రాజకీయ శత్రువులని అందరికీ తెలుసు. కానీ, మీరు తెలంగాణలో రెండు పార్టీలు కలిసిపోయాయని అంటున్నారు?**

తెలంగాణలో 'అజబ్ ప్రేమ్ కీ గజబ్ కహానీ' నడుస్తున్నది. తెలంగాణకు వచ్చి చూస్తే మీరే ఆశ్చర్యపోతారు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. కొన్నాళ్ల కిందట రెవెన్యూ శాఖ మంత్రి ఇంట్లో ఈడీ సోదాలు జరిగాయి. రెండు కౌంటింగ్ మెషీన్లతో డబ్బులు లెక్కిస్తున్నారని మీడియాలో వచ్చింది. ఐదు వారాలు గడిచినా ఈడీ నుంచి కనీసం ఐదు వాక్యాలతో స్టేట్‌మెంట్ రాలేదు. మంత్రి కూడా చెప్పడం లేదు. అదానీ ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి ఐటీసీ కోహినూర్‌లో రహస్యంగా సమావేశం అయ్యారు. ఈ విషయాన్ని మేం బహిర్గతం చేస్తే ఇప్పటివరకు ఒక్కరూ ఖండించలేదు. కర్ణాటకలో వాల్మీకి స్కాం జరిగింది. ఈడీ చెప్పినదాని ప్రకారం రూ.35 కోట్లు తెలంగాణకు వచ్చాయి. వాటిని ఇక్కడ పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించారు. కానీ, ఇప్పటివరకు తెలంగాణలో ఎవరి మీదా కేసులు లేవు, విచారణ లేదు. అమృత్ స్కాంపై ఫిబ్రవరిలోనే కేంద్రానికి లేఖ రాశాం. కానీ, డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ కూడా జరగలేదు. ప్రధాని మోదీ తరుచూ ఏటీఎం, ఆర్ఆర్‌ట్యాక్స్ అని ఆరోపిస్తున్నారే తప్ప, విచారణ జరపడం లేదు. వీటిని బట్టే బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే అని అర్థం అవుతున్నది. తెలంగాణలో బీఆర్ఎస్‌ను నామరూపాలు లేకుండా చేస్తే ఇద్దరమే ఏలుకోవచ్చని అనుకుంటున్నట్టు స్పష్టంగా తెలుతున్నది.

**కుల సర్వేపై మీ అభిప్రాయం ఏమిటి?**

కాంగ్రెస్ పార్టీ ఆరు జనాభా గణనలు చేసిన తర్వాత ఇప్పుడు కులగణన చేయాలని అనుకోవడం విచిత్రం. కచ్చితమైన లక్ష్యం లేకపోతే కులసర్వేతో లాభం ఉండదు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 42% రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే సర్వేను స్వాగతిస్తాం. కానీ, మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో లబ్ధి కోసమే చేస్తున్నారు కాబట్టి వ్యతిరేకిస్తున్నాం. సర్వేలో 75 ప్రశ్నలు అడగడంపై అభ్యంతరం చెప్తున్నాం. సామాజిక పరిస్థితులు తెలుసుకోవడం వరకే పరిమితం కాకుండా.. ఇంట్లో ఫ్రిజ్ ఉన్నదా? ఏసీ ఉన్నదా? రాజకీయ చరిత్ర ఏమిటి? వంటివి ఎందుకు? అందుకే తెలంగాణ ప్రజలు తిరగబడుతున్నారు. ఈ సమాచారం తీసుకొని సంక్షేమ పథకాలను తీసేస్తారని అనుమానిస్తున్నారు. ఈ సర్వేతో ఏం చేస్తున్నారో రాహుల్‌గాంధీ చెప్పాలి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచడమే లక్ష్యం అయితే.. నేరుగా పెంచొచ్చు. సర్వే ఎందుకు? వచ్చిన ఫలితాలతో ఏం చేస్తారు? 50% రిజర్వేషన్ల అడ్డంకిని ఎలా అదిగమిస్తారు. వంటివి చెప్పకుండా ప్రజలను మళ్లీ ఫూల్ చేస్తున్నారు.

**బీజేపీ, కాంగ్రెస్ మధ్య అవగాహన తెలంగాణకే పరిమితమని భావిస్తున్నారా?**

దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ఎస్పీఎన్, బీఎస్పీ వంటి ప్రాంతీయ పార్టీలతో జట్టు కట్టింది. మరి ఎందుకు ఓడిపోయింది? 'అయితే మీరుండాలి.. లేదంటే మేముండాలి.. మూడో శక్తి ఉండొద్దు' అనేది వాళ్ల మనసులో ఉన్నది. వన్ నేషన్-వన్ ఎలక్షన్ ఎవరు అడిగారు? ఇది ప్రాంతీయ పార్టీలను దెబ్బకొట్టేందుకు కాదా? హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికలను ఒకేసారి జరపలేనప్పుడు దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?

**ప్రాంతీయ పార్టీల అవసరం లేదని రేవంత్‌రెడ్డి అన్నట్టున్నారు?**

కాంగ్రెస్, బీజేపీ కోరుకుంటున్నది అదే. అన్ని ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేసి, రెండు పార్టీల మధ్యలో అధికారం ఉండాలన్నదే ఆ పార్టీల లక్ష్యం.

**రాష్ట్రంలో అదానీ పెట్టుబడులు పెడితే తప్పేముందని రేవంత్ అంటున్నారు కదా?**

ఈ ప్రశ్నను రాహుల్‌గాంధీని అడగాలి. ఆయన రోజూ అదానీ గురించి, అవినీతి గురించి మాట్లాడుతున్నారు. రాహుల్‌గాంధీ యేమో 'అదానీ ఫ్రాడ్' అంటారు.. రేవంత్ 'ఫ్రెండ్' అంటారు. 'గుజరాత్ మాడల్ బేకార్' అని రాహుల్ అంటే.. 'గుజరాత్ మాడల్ అద్భుతం' అని రేవంత్ పొగుడుతారు. 'చౌకీదార్ చోర్ హై' అని రాహుల్ విమర్శిస్తే.. 'బడే బాయ్' అని రేవంత్ కొనియాడుతారు. ముందు వాళ్లిద్దరూ ఒకచోట కూర్చొని ఒక్క మాట మీదికి రావాలి. అదానీ ఫ్రెండా? ఫ్రాడా? అనేది కాంగ్రెస్ స్పష్టంచేయాలి. ఒకవేళ ఫ్రాడ్ అయితే కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎందుకు అదానీ పెట్టుబడులను స్వాగతిస్తున్నారు? ఎందుకు చెక్కులు అందుకుంటున్నారు? ఒకవేళ ఫ్రెండ్ అయితే రాహుల్‌గాంధీ తన విమర్శలు మానుకోవాలి. దేశంలో కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నది. అదానీ అంశంలో మూడు రాష్ట్రాలనే ఒక్కమాట మీదికి తీసుకురాలేని కాంగ్రెస్.. భారత్ జోడో ఎలా చేస్తుంది.

**మీరు అరెస్ట్ అవుతారని అనుకుంటున్నారా?**

మన దేశంలో విచిత్రాలు జరుగుతుంటాయి. ప్రజలను బహిరంగంగా కాల్చి చంపిన కసబ్‌ను ఉరితీయడానికి నాలుగేండ్లు పట్టింది. రెడ్ హ్యాండెడ్‌గా రూ.50 లక్షలతో దొరికిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు బయట సీఎంగా ఉన్నారు. ఇలాంటి విచిత్రాలు జరుగుతుంటాయి. ఒకవేళ వాళ్లు నన్ను అరెస్ట్ చేయాలనుకుంటే చేయమనండి, దర్యాప్తు చేయండి, నిరూపించమనండి. తప్పు చేయనప్పుడు నేను ఎందుకు భయపడాలి.

**కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి ఎలా ఉండబోతున్నది?**

ప్రస్తుతం హైదరాబాద్‌లో అభివృద్ధికి బదులు విధ్వంసం జరుగుతున్నది. ఆదాయం పడిపోయింది. ఐటీ కంపెనీలు వెళ్లిపోతున్నాయి. కెయిన్స్ కంపెనీని కష్టపడి మైసూర్ నుంచి హైదరాబాద్‌కు తెస్తే.. గుజరాత్‌కు వెళ్లిపోయింది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్లాంట్‌ను కష్టపడి యూఎస్ నుంచి తెస్తే తెలంగాణ దాటిపోయింది. ఫాక్స్‌కాన్ కంపెనీ లక్ష మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు విస్తరణ ఆపేసింది. ఇది నెగెటివ్ గవర్నమెంట్. మూసీ బ్యూటిఫికేషన్ పేరుతో పేదల ఇండ్లు కూలగొడుతున్నది. డీపీఆర్ లేకుండా లక్షన్నర కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైంది. 16వేల ఇండ్ల కూలగొట్టేందుకు సిద్ధమైంది. ఇలాంటి నెగెటివ్ పాలిటిక్స్‌ను నా పొలిటికల్ జీవితంలో చూడలేదు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చింది. గ్యారెంటీల్లో కనీసం సగం కూడా నెరవేర్చలేదు.

**ఫార్ములా-ఈ రేసుపై కేసుకు భయపడే ఢిల్లీకి వచ్చారని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది?**

ఫార్ములా-ఈ రేసులో ఏ కుంభకోణం ఉన్నదో చెప్పాలి? అంతర్జాతీయ ఈవెంట్‌ను హైదరాబాద్‌కు కష్టపడి తీసుకొచ్చాను. నాలుగేండ్లపాటు నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నాం. మొదటి సంవత్సరం సూపర్ హిట్. 31వేల మంది వీక్షించారు. నెల్సన్ రిపోర్ట్ ప్రకారం హైదరాబాద్‌కు 82 మిలియన్ డాలర్ల ఆర్థిక ప్రయోజనం కలిగింది. మేం రూ.40-45 కోట్లు వెచ్చిస్తే, రూ.700 కోట్లు లాభం కలిగింది. రెండో సంవత్సరం ప్రమోటర్ వెనక్కి వెళ్లిపోవడంతో, మేం అడ్వాన్స్ చెల్లించాల్సి వచ్చింది. అందుకే రూ.50 కోట్లు కట్టండి.. నేను ప్రమోటర్‌ను తీసుకొస్తాను, ఈవెంటన్‌ను ఇంకా బాగా చేస్తామని చెప్పాను. ఇందులో అవినీతి ఏముంది? దీనికి మొత్తం బాధ్యత నాదే. ఈ ఏడాది కూడా నిర్వహించి ఉంటే 90 మిలియన్ డాలర్ల ప్రయోజనం కలిగేది. కాంగ్రెస్ ప్రభుత్వం క్యాన్సిల్ చేసింది. అంతర్జాతీయంగా తెలంగాణ పరువు పోయింది. మేం ఫార్ములా-ఈ తో హైదరాబాద్‌కు ఇంటర్నేషనల్ ఫేమ్ తెస్తే.. కాంగ్రెస్ ఇంటర్నేషనల్ షేమ్ చేసింది. నిజంగా అవినీతి ఉంటే నిరూపించమనండి. దేశంలో ఎక్కడి నుంచైనా ఎక్కడికైనా వెళ్లొచ్చు. పాస్‌పోర్ట్‌గానీ, రేవంత్ పర్మిషన్‌గానీ అవసరం లేదు. రేవంత్ రెడ్డి 11 నెలల్లో 26సార్లు ఢిల్లీకి రావొచ్చు.. కానీ నేను మూడునాలుగు సార్లు ఢిల్లీకి రావద్దా? 26 సార్లు వచ్చి కనీసం 26 పైసలైనా తెచ్చారా? మీరు ఢిల్లీకి గులాములు. మేముం ఎవరికీ గులాములం కాదు. తెలంగాణ ప్రజల కోసం కాంగ్రెస్, బీజేపీ.. ఎవరితో అయినా పోరాడుతాం.

**రైతు రుణమాఫీ చేశామని అంటున్నారు. మహారాష్ట్రలో కూడా అదే ప్రచారం చేస్తున్నారు.**

ఇండియా టుడే నుంచి ప్రత్యేక బృందం సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గానికే వెళ్లండి. ఒక్క గ్రామంలో అయినా వందశాతం మందికి రుణమాఫీ అయినట్టు చెప్తే నేను ఆరోపణలను వెనక్కి తీసుకుంటా. కాంగ్రెస్ పార్టీ 75 ఏండ్లుగా అబద్ధాలు చెప్తునే ఉన్నది. ప్రజలను మోసం చేయడంలో వాళ్లు ప్రొఫెషనల్స్.

**మహారాష్ట్రలో ఎవరికి మద్దతు ఇస్తున్నారు?**

మేము మహారాష్ట్రలో విస్తరించాలని అనేక ప్రణాళికలు వేశాం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కాస్త వెనుకడుగు వేయాల్సి వచ్చింది. మహారాష్ట్రలో ప్రాంతీయ పార్టీలకే ఓటేయాలని ప్రజలను కోరుతున్నాం. శివసేన, ఎన్సీపీ వంటి పార్టీలకే ఓటేయాలని కోరుతున్నాం. జాతీయ పార్టీలకు ఓటేయొద్దని కోరుతున్నాం.

**ఏపీలో అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకరిస్తున్నదని అంటున్నారు. హైదరాబాద్‌కు పోటీ వస్తుందని అనుకుంటున్నారా?**

దేశంలో ఒక నగరాన్ని మరో నగరంతో పోల్చడం సరికాదు. మొత్తంగా అందరం ఒకే దేశం. హైదరాబాద్ ఎవరితోనూ పోటీ పడటం లేదు. తెలంగాణ ల్యాండ్ ల్యాక్డ్ స్టేట్, ఏపీకి కోస్టల్ సిటీ ఉన్నది. అన్నింటికన్నా ముఖ్యంగా నగరాలను ఎవరో ఒకరు సృష్టించలేరు. అవి స్వయంగా అభివృద్ధి చెందాలి. కేవలం నిర్మాణాలు మాత్రమే మన చేతిలో ఉంటాయి. అమరావతి కూడా అభివృద్ధి చెందాలన్నదే మా ఆకాంక్ష.

**అదానీ విషయంలో బీఆర్ఎస్ స్టాండ్ ఏమిటి?**

ప్రజల పక్షాన ఉంటాం. ప్రజలను దృష్టిని పెట్టుకొనే ఏ పెట్టుబడినైనా వ్యతిరేకిస్తాం. అదానీ ఇప్పుడు నల్లగొండ జిల్లలోని రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తున్నారు. దీనిని గ్రామ ప్రజలు మొత్తం వ్యతిరేకిస్తున్నారు. కానీ, రేవంత్ రెడ్డి అదానీ నుంచి రూ.100 కోట్ల చెక్ అందుకున్నారు కాబట్టి ఫ్యాక్టరీని అక్కడే పెట్టాలని నిర్ణయించుకున్నారు. అదానీ తెలంగాణకు వచ్చిన తర్వాత రెవెన్యూ మంత్రితో సంబంధాలు పెంచుకున్నారని చెప్పుకుంటున్నారు. త్వరలో ఐవీఆర్‌సీఎల్‌ను టేకోవర్ చేస్తారని, హైదరాబాద్‌లో 84 ఎకరాల విలువైన భూములు తీసుకుంటున్నారని ప్రచారం జరుగుతున్నది. ఇవన్నీ పదవిని దుర్వినియోగం చేసి, సంపదను పోగేసుకోవడానికే. ఆ డబ్బుతో ఎమ్మెల్యేలను కొనడం, ప్రభుత్వాలను కూలగొట్టడం, ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడం వంటివి చేస్తారు. ఈ పరిణామాలు దేశానికి మంచివి కాదు.

## తెలంగాణలో పెరుగుతున్న చలి తీవ్రత

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉత్తర, ఈశాన్య దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా చలి ప్రభావం ఎక్కువగా ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. చలికి తోడు భారీ పొగ మంచు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మెదక్‌లో అత్యల్పంగా 14.8 డిగ్రీల సెల్సియస్, ఆదిలాబాద్‌లో 15.7 డిగ్రీల సెల్సియస్, పటాన్‌చెరులో 16.2, దుండిగల్‌లో 18, నిజామాబాద్‌లో 18.7, రామగుండం, హనుమకొండ, హకీంపేటల్లో 19, హైదరాబాద్‌లో 19.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదుకాగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదవుతున్నట్టు వాతావరణశాఖ తెలిపింది. కొన్నిచోట్ల 32 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పడిపోతున్న నేపథ్యంలో ఆస్తమా, ఫ్లూ వంటి వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని.. ఉన్ని దుస్తులు ధరించాలని, పిల్లలు, వృద్ధులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ధాన్యం ధరలు తగ్గడం ప్రభుత్వ కుట్రే

- మిల్లర్లతో మంత్రుల కుమ్మక్కు
- కొనుగోళ్లలో కోట్ల అవినీతి
- ఎంత ధాన్యం, పత్తి కొన్నరు?
- సన్నవెన్ని? బోనస్ ఇచ్చారా?
- ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటుకు 'కొడంగల్' సాక్ష్యం
- ఢిల్లీకి 27 సార్లు వెళ్లిన రేవంత్ ఎవరికాళ్లు మొక్కారో?
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ధాన్యం, పత్తి ధరలు తగ్గడానికి రేవంత్ సర్కార్ కుట్రే కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. పత్తి, వడ్ల కొనుగోళ్ల విషయంలో రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి రివ్యూ చేస్తున్నట్టుగా డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రాలు ప్రారంభించి నెలరోజులైనా కొనుగోళ్లు చేయకుండా ప్లాన్ ప్రకారం రైతులను దళారీలకు, మిల్లర్లకు వదిలేశారని విమర్శించారు. దళారులు, మిల్లర్లతో మంత్రులు కుమ్మక్కు అయ్యారని, దీని వెనుక రూ.వందల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. నల్లగొండ జిల్లా మంత్రి రైతుల వద్ద ధాన్యం కొనకుండా అధికారులను బెదిరించారని, దళారులతో కుమ్మక్కై వందల కోట్లు వసూలు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొన్నారు? ఇందులో సన్న వడ్లు ఎన్ని? దొడ్డు వడ్లు ఎన్ని? పత్తి ఎన్ని క్వింటాళ్లు కొన్నారు? బోనస్ ఎన్ని క్వింటాళ్లకు ఇచ్చారు? తదితర వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. వివరాలు చెప్పకుంటే అవినీతిని ప్రభుత్వం ఒప్పుకున్నట్టుగా భావిస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేశామని, తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలుచేసిన విషయం రైతులను తెలుసని పేర్కొన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు మళ్లీ వచ్చాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు ఎందుకు దోపిడీకి గురి అవుతున్నారో సీఎం, వ్యవసాయశాఖ మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు సన్న వడ్లు ఒక్క గింజ కూడా ప్రభుత్వం కొనలేదని, సమాధానం చెప్పడానికి అధికారులు భయపడుతున్నారని నిలదీశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందని హెచ్చరించారు.

**రేవంత్ ఎవరికాళ్లు మొక్కారో ప్రజలకు తెలుసు**

కేటీఆర్ ఢిల్లీ పర్యటనపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి 25సార్లు ఢిల్లీ వెళ్లి ఎవరి కాళ్లు మొక్కారో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. ఉదయం రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ కాళ్లు, రాత్రి మోదీ, అమిత్‌షా కాళ్లు రేవంత్ రెడ్డి పట్టుకుంటున్నారని ఆరోపించారు. బాజాప్తా కాంగ్రెస్, బీజేపీ బండారం బయట పెడతామని కేటీఆర్ చెప్పి మరీ ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై కేటీఆర్ కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశారని, రేవంత్ అవినీతిపై బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కేటీఆర్ ఎక్కడ ఉన్నారో.. ఎవరిని కలిశారో.. మీ ఇంటెలిజెన్స్ ఉంది కదా.. తెలుసుకోండని చురక లంటించారు. రాష్ట్ర మంత్రి ఇంటిపై జరిగిన ఈడీ రైడ్స్ వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డి వీపు పగలగొట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. రైతుబంధు, రుణమాఫీ, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవుగానీ, మహారాష్ట్ర పత్రికల్లో యాడ్స్‌కు ఖర్చుపెట్టడానికి రూ.300 కోట్లు ఎలా వచ్చాయని నిలదీశారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలకు కూడా రూ.300 కోట్ల ప్రజాధనం ఖర్చుచేశారని విమర్శించారు.

**కొడంగల్‌లో మొదలైంది ప్రభుత్వంపై తిరుగుబాటు**

రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు మొదలైందని జగదీశ్‌రెడ్డి చెప్పారు. ప్రజలు మర్చిపోయారు అంటున్న కేసీఆర్‌ను చూసి రేవంత్‌రెడ్డి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను వాడుకుని రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని, ఆ పార్టీని మంచుతున్నారని సొంత పార్టీ కార్యకర్తలే ఆరోపిస్తున్నారని చెప్పారు. చెడ్డ పేరు తెచ్చుకుని చరిత్రలో నిలిచిపోవాలని రేవంత్ భావిస్తున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో ఉన్న మేధావులు కొడంగల్‌కు వెళ్లిరావాలని, అక్కడ ఏం జరిగిందో తెలుసుకోవడానికి మేధావులు, ప్రొఫెసర్లు, పౌర హక్కుల నేతలను ప్రభుత్వం పంపించాలని సూచించారు.

కరీంనగర్ జిల్లా గంగిపల్లిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరఫున శ్రీనివాస్, అతని తల్లి, చెల్లికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు జీవీ రామకృష్ణారావు, నారదాసు లక్ష్మణ్‌రావు

## కానిస్టేబుల్ కుటుంబానికి కేటీఆర్ అండ

- డిస్మిస్ అయిన బెటాలియన్ కానిస్టేబుల్ శ్రీనివాస్ చెల్లెలు వివాహానికి రూ.3 లక్షల సాయం
- ఇంటికెళ్లి అందజేసిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నేతలు

మానకొండూర్ రూరల్, నవంబర్ 12: సిరిసిల్లలోని 17వ బెటాలియన్ కానిస్టేబుల్ రాధారపు శ్రీనివాస్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన బెటాలియన్ కానిస్టేబుల్ రాధారపు శ్రీనివాస్ ఇటీవల సిరిసిల్లలో ఆందోళన చేయగా.. ప్రభుత్వం అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. శ్రీనివాస్ చెల్లెలు కావ్యశ్రీ వివాహం ఈ నెల 14న ఉంది. రెండ్రోజుల కింద సిరిసిల్ల పర్యటనకు వచ్చిన కేటీఆర్‌ను శ్రీనివాస్ కలిసి తన బాధను విన్నవించగా.. వెంటనే ఆయన శ్రీనివాస్ తల్లి సరోజనతో ఫోన్లో మాట్లాడారు. 'అమ్మా మీ కుటుంబానికి అండగా ఉంటా. బిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం అందజేస్తా. నీ కొడుక్కు మళ్లీ ఉద్యోగం వచ్చేలా కొట్లాడుతా' అని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కావ్యశ్రీ వివాహం కోసం రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని మంగళవారం పంపించగా.. బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతోపాటు మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు శ్రీనివాస్ ఇంటికెళ్లి అందజేశారు.

భీమ్‌గల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

## తులం బంగారం ఎప్పుడిస్తరు?

- ఓట్ల కోసం నమ్మించిన రేవంత్
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మాజీ మంత్రి వేముల ధ్వజం

భీమ్‌గల్, నవంబర్ 12: 'కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామని ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి మాట ఇచ్చిండు. అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటింది. ఇప్పటిదాకా ఏ ఒక్కరికీ తులం బంగారం ఇవ్వలేదు. ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం ఎప్పుడిస్తారు?' అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో 224 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డ పెండ్లి జరిగితే ఆ కుటుంబానికి అండగా ఉండాలని కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. రూ.2 లక్షల రుణమాఫీ, పంటకు రూ.500 బోనస్, రూ.15 వేల రైతు భరోసా ఇస్తామన్న రేవంత్ కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. తులం బంగారం, నెలకు రూ.2,500, రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నారా? అని అక్కడున్న మహిళను వేముల ప్రశ్నించగా.. రావట్లేదని వారు బదులిచ్చారు.

# రేవంత్ ఎవరి కాళ్లు మొక్కడానికెళ్లారు?

- పొంగులేటి ఇంటిపై ఈడీ దాడుల వివరాలు ఎందుకు చెప్పరు?
- కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 25సార్లు ఢిల్లీకి ఎవరి కాళ్లు మొక్కడానికి వెళ్లారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ రెండుమూడు రోజులు అక్కడే మకాం వేశారని, ఢిల్లీకి చక్కర్లు కొట్టడానికే 50-60 రోజులు సరిపోయిందని ఎద్దేవాచేశారు. రేవంత్‌రెడ్డి ఇన్నిసార్లు వెళ్లి కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేయలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భయపడి ఢిల్లీ వెళ్లారంటూ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ విమర్శించడంపై సుధీర్‌రెడ్డి భగ్గుమన్నారు. అమృత్ టెండర్ల విషయంలో కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేస్తామని కేటీఆర్ ముందే చెప్పి వెళ్లారని గుర్తుచేశారు. తెలంగాణభవన్‌లో మంగళవారం



తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే కాలేరుతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి

ఆయన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై బీఆర్ఎస్‌ను డ్యామేజ్ చేయాలని కుట్రపన్నాయని, కేసీఆర్ కుటుంబాన్ని బద్నాం చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఏదో ఒక కేసులో కేటీఆర్‌ను ఇరికించాలని చూస్తున్న రేవంత్‌రెడ్డికి.. 'మలేషియా వెళ్లలేదు.. ఇక్కడే ఉన్నాను. ఎప్పుడైనా వచ్చి అరెస్టు చేసుకోవచ్చు..' అని సవాల్ విసిరిన ధైర్యశాలి కేటీఆర్ అని పేర్కొన్నారు. కాళ్లబేరానికి రావాల్సిన ఖర్మ తమకు లేదని, కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేయడానికి కేటీఆర్ వెళ్లారని స్పష్టం చేశారు.

**పొంగులేటి ఇంట్లో ఈడీ దాడిపై మాట్లాడరెందుకు?**

మంత్రి పొంగులేటి ఇంట్లో జరిగిన ఈడీ దాడులపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరుమెదపడం లేదని సుధీర్‌రెడ్డి నిలదీశారు. దాడులపై ప్రెస్‌నోట్ ఇచ్చే ఈడీ అధికారులు ఇన్నిరోజులైనా వివరాలు వెల్లడించకపోవడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీలో బీజేపీతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేయాలని కాంగ్రెస్, బీజేపీ డిసైడ్ అయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి విమర్శలు చేయడం లేదని దుయ్యబట్టారు. ఫార్మాసిటీ కోసం 19 వేల ఎకరాలు సిద్ధంగా ఉన్నా, లగచర్లలో మరో 4 వేల ఎకరాల భూ సేకరణకు రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టినప్పుడు రైతులను, ప్రజలను ఒప్పించి భూములు సేకరించామని తెలిపారు. లగచర్ల ఘటన ప్రారంభం మాత్రమేనని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ప్రభుత్వంపై తిరగబడేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మహారాష్ట్రలో గురుద్వారాను దర్శించుకున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్ బృందం

## 'మహా' ఎన్నికల పరిశీలన

- మేధావులను కలిసిన వినోద్ బృందం
- సీనియర్ జర్నలిస్టులతో కలిసి గ్రామాల్లో రెండురోజుల పర్యటన

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల సరళిని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ బృందం పరిశీలించింది. వినోద్ నేతృత్వంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తెలంగాణ పౌర సరఫరాలశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, నాయకుడు రంగినేని పవన్‌కుమార్(ఆదిలాబాద్), హైదరాబాద్ నుంచి ఇద్దరు సీనియర్ జర్నలిస్టులతో కలిసి మహారాష్ట్రలో రెండురోజులపాటు పర్యటించారు. మరఠ్వాడా, విదర్భ ప్రాంతాల్లోని పలు శాసనసభ నియోజకవర్గాల్లో ఉన్న గ్రామాలను సందర్శించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాందేడ్, కిన్వట్, బోఖర్, నాయిగౌన్, ముఖేడ్ ప్రాంతాల్లో విద్యావేత్తలు, న్యాయవాదులు, ఇంజినీర్లు, రాజకీయ విశ్లేషకులను కలిసి మహారాష్ట్ర ఎన్నికల సరళిపై అభిప్రాయాలు సేకరించారు.